క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



కండువా కప్పి ఆహ్వానిస్తున్న విశ్వప్రసాద్‌రావ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. డీసీసీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని, బీఆర్‌ఎస్ పార్టీ అవినీతిని ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్ల తేలికుల యువజన సంఘం అధ్యక్షుడిగా సందీప్



సందీప్

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిల గాండ్ల తేలికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావ్ అధ్యక్షతన అఖిల గాండ్ల తేలికుల రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వాంకిడి మండలం ఖమాన గ్రామానికి చెందిన హిర్రే సందీప్ అఖిల గాండ్ల తేలికుల రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

స్థలం కేటాయించాలని వినతి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: వాంకిడి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలని సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కోరారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేను తన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. నాయకులు రాములు, బండు, పోచయ్య, శ్రీనివాస్, చందు, రాము, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు

కైలాస్‌నగర్: విద్యార్థులు పక్కా ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మాక్ పోలింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు. పరీక్షల్లో రాణించిన విద్యార్థులకు గ్రేడ్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాక్ పోలింగ్‌లో ఓటు వేసి విద్యార్థులను ప్రోత్సహించారు. ఆయన మట్లాడుతూ.. సమాజానికి తనవంతుగా సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చినట్లుగా పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: బోలా శంకర్
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: బోలా శంకర్

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.80
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	80
క్యాబేజ	60

-ఆసిఫాబాద్‌అర్బన్



ఈ రైతు పేరు తాళ్ల పల్లి దీపక్ గౌడ్. ఈయన రుద్రాపూర్ గ్రామ శివారులో రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. వరి నాట్లు వేసి 15రోజులు గడిచింది. నాట్లు వేసిన నాటి నుంచి వర్షాలు పడడం లేదు. వరి పంట ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో డీజిల్ ఇంజన్‌తో వరి పొలానికి నీరు పెడుతున్నాడు. ప్రతీరోజు రూ.1500 నుంచి రూ.2వేల వరకు అదనంగా ఖర్చవుతుందని రైతు వాపోతున్నాడు.

- వర్షాలు లేక ఆందోళనలో రైతులు
- దిగుబడిపై సన్నగిల్లుతున్న ఆశలు
- డీజిల్ ఇంజన్లతో నీటి సరఫరా
- పెరుగుతున్న ఖర్చు



చింతలమానెపల్లిలో వర్షాలు లేక బీటలు వారిన పొలం

పంటలు ఎండుతున్నాయ్..!

చింతలమానెపల్లి: రైతులకు కాలం పరీక్ష పెడుతోంది. పంటలు పండించేందుకు వాతావరణం కూడా సహకరించడం లేదు. సకాలంలో కురవని వర్షాలతో రైతులకు అదనపు కష్టం తప్పడం లేదు. మండలంలో వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తుండగా, వానలు లేక పంటల దిగుబడిపై అన్నదాతల ఆశలు సన్నగిల్లుతున్నాయి.

23 వేల ఎకరాల్లో సాగు..

మండలంలో 23 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. 16వేల ఎకరాల్లో పత్తి, 3600 ఎకరాల్లో వరి, 350 ఎకరాల్లో మిరప, 3050 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతున్నాయి. వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తుండగా కొద్ది మొత్తంలో బోరు బావులపై ఆధారపడుతున్నారు. కాగా గత ఏడాదితో పోల్చితే ఈఏడాది మండలంలో ఇప్పటి వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో 214 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి 162 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. గత ఏడాది జూన్‌లో 325 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. ఈ ఏడాది ఆలస్యంగా జూన్ నెలాఖరులో కురిసిన వర్షాలు మళ్లీ మొహం చాటేశాయి. జూలైలో సాధారణ వర్షపాతం నమోదు కాగా ఆగస్టులో ఇప్పటి వరకు వర్షాలు పడలేదు.

భూములకు బీటలు..

ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడంతో గందరగోళానికి గురైన రైతులు 70శాతం మాత్రమే విత్తనాలు నాటారు. వరి సాగు చేసేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తక్కువ శాతంలో రైతులు వరి సాగు చేస్తున్నారు. వరి నాట్లు పూర్తయిన తర్వాత వర్షాలు కురవకపోవడంతో నీరు ఇంకిపోయి భూములు బీటలు వారుతున్నాయి. చెరువులు, కుంటల కింద వరి సాగు చేస్తున్న రైతులు కాలువల ద్వారా నీళ్లు పొలాలకు మళ్లిస్తున్నప్పటికీ వర్షాధారంగా సాగు చేసే వరి పంటకు నీరందే పరిస్థితి లేదు. మండల కేంద్రానికి చెందిన రైతులు వాగు చెక్ డ్యాంలోని నీటిని మోటార్లతో వరి సాగు భూములకు తరలిస్తున్నారు. కొంత మంది రైతులు విద్యుత్ సరఫరా లేని పరిస్థితుల్లో డీజిల్ ఇంజన్ల ద్వారా పంటలకు నీరందిస్తున్నారు. సాగు ఆరంభంలోనే అదనపు ఖర్చవుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డీజిల్ ఇంజన్ల ద్వారా నీటిని అందిస్తున్న రైతులకు ప్రతీరోజు అదనంగా రూ.1500 వరకు వ్యయమవుతోంది.

రెండోసారి నాటిన విత్తనాలు..

సీజన్ ఆరంభంలో వర్షాలు లేక నాటిన విత్తనాలు కుళ్లిపోవడంతో పత్తి పంటలో ఎకరాకు రూ.5 వేల వరకు నష్టం రాగా, మిరప పంటలో రూ.8 వేల నుంచి రూ.10వేల వరకు నష్టం వాటిల్లింది. పత్తి, మిరప, కంది రైతులు రెండోసారి విత్తనాలు కొనుగోలు చేసి నాటుకున్నారు. మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయడంతో ఖర్చు భారీగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పంటల దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

సామూహిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



పత్తి, కంది రైతులు నేలను అనుసరించి పంటల ఎదుగుదలకు సంబంధించిన మందులు చల్లుకోవాలి. వర్షాధారంగా పంటలు సాగు చేసే రైతులు తమకున్న వనరులను పరిమితంగా వినియోగించుకోవాలి. సామూహిక సాగు పద్ధతులు పాటిస్తే రైతులు అదనపు వ్యయాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుంది. సలహాలు, సూచనల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి

ఎమ్మెల్యేను కలిసిన స్వర్ణకారులు



సక్కును సన్మానిస్తున్న సంఘ నాయకులు

ఆసిఫాబాద్: జిల్లా స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణకారులు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించారు. స్వర్ణకారుల సంఘం కోరిక మేరకు జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా స్వర్ణకార సంఘం కార్యాలయ భవనం ఏర్పాటుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీరామ్ వరప్రసాద్ చారి, పెంటయ్య, వంశీకృష్ణ, మహేశ్, నల్లగొండ తిరుపతి, నర్సింగోజు మహేశ్, సభ్యులు పాల్గొన్నారు.

బోదకాల నివారణకు కృషి చేయాలి



బోదకాల నివారణ మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో బోదకాల నివారణకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి బోదకాల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గ్రామాల్లో ఉన్న బోదకాల వ్యాధిగ్రస్థులను గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, వైద్యసిబ్బంది రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

హత్తిని రోడ్డుకు మోక్షం

- పలుమార్లు 'సాక్షి'లో కథనాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది

దహెగాం: మండలంలోని హత్తిని రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 'సాక్షి'లో వచ్చిన కథనాలకు స్పందించిన అధికారులు నిలిచిపోయిన బీటీ రోడ్డు పనులను శనివారం పూర్తి చేశారు. మండల కేంద్రం నుంచి హత్తిని గ్రామానికి నవంబర్, 2020లో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.28 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు నత్తనడకన కొనసాగుతున్న నేపథ్యంలో 'సాక్షి'లో 'నిలిచిన హత్తిని రోడ్డు పనులు', 'హత్తిని రోడ్డుకు గ్రహణం' శీర్షికన కథనాలు ప్రచురితమయ్యాయి. వీటికి స్పందించిన అధికారులు బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. నెల రోజుల క్రితం పనులు కూడా ప్రారంభించారు. హత్తిని నుంచి కేవలం కిలో మీటరు వరకు బీటీ వేసి పనులు నిలిచిపోవడంతో 'సాక్షి'లో మరోసారి 'నిలిచిన బీటీ పనులు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు మేల్కొని శనివారం బీటీ వేసే పనులు పూర్తి చేశారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాగజ్‌నగర్‌లో భారీ శోభాయాత్ర

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో హజరత్ బాబా తాజుద్దీన్ ఉర్సు ఉత్సవాలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తాజ్‌నగర్ కాలనీలో ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని మధ్యాహ్నం హజరత్ బాబా తాజుద్దీన్ ఫౌండేషన్ పదాధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం లంగర్ (ప్రసాద వితరణ) కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం పట్టణంలో లారీ చౌరస్తా నుంచి శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో అశ్వాల విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. డీఎస్పీ ఎ.కరుణాకర్ ఆధ్వర్యంలో పట్టణ సీఐ బుద్దే స్వామి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.



శోభాయాత్రలో అశ్వంతో నృత్య విన్యాసం

మజ్జిగ, లస్సీ పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌక్‌లో శనివారం హజ్రత్ బాబా తాజుద్దీన్ ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, లస్సీ, మంచినీళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల ప్రజా ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, లస్సీ పంపిణీ చేశారు.

సమస్యలు ప్రస్తావనకు వచ్చేనా?

- నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం
- గ్రామాల్లో రాజ్యమేలుతున్న సమస్యలు

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లా ఖాన్ తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

గ్రామాల్లో అనేక సమస్యలు

గ్రామాల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. మండలంలో తాగునీరు లేక, అధ్వానంగా ఉన్న రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కౌటాల వారసంత స్థలం కబ్జాకు గురవడంతో వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో ప్రతీ సోమవారం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. మండల కేంద్రంలో దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో సులభ్‌కాంప్లెక్స్‌లు లేవు. గ్రామాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా కళ్ల కలకతో బాధపడుతున్నారు. గ్రామాల్లో ఫాగింగ్ లేక ప్రజలు దోమలతో సహవాసం చేస్తున్నారు. ఎరువుల కొరత లేకుండా చూడాల్సి ఉంది. విద్యుత్ కోతలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సమావేశంలో చర్చించనున్నారు. కోతులు, కుక్కలు, పందులు, పశువుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో సమావేశానికి హాజరు కాలేరు. ఈ పరిస్థితుల్లో నేటి మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారా.. లేక వాయిదా వేస్తారా అనే చర్చ కొనసాగుతోంది.

ఆంజనేయ ఆలయంలో అన్నదానం

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడ కాలనీలో గల ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ శనివారం దాతల సహకారంతో భక్తులతో పాటు నిరుపేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు షెండె సందీప్ తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని భక్తులతో పాటు మండలంలోని నవేగాం, హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కాగజ్‌నగర్‌టౌన్: ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సహకారంతో మంజూరైన రూ.18000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పట్టణంలోని గుంటూరు కాలనీకి చెందిన బాలయ్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరు చేశారు.

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: మారుమూల గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని ఆరెగూడ గ్రామంలో సాయి స్వాస్థ్య వెల్‌నెస్ సెంటర్, శ్రీసత్యసాయి సుజల ప్రవంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నీటితో కోళ్లు శుభ్రం!

- సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్
- కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో విక్రయం!

చింతలమానెపల్లి: కాగజ్‌నగర్ ఈఎస్‌ఐ ఆసుపత్రి సమీపంలో ఒక కోళ్ల వ్యాన్‌లోని బాయిలర్ కోళ్లను ఆసుపత్రి సమీపంలోని డ్రెయినేజీ నీటితో శుభ్రం చేసిన ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. పట్టణానికి చెందిన పలువురు యువకులు కోళ్లను మురికి నీటితో శుభ్రం చేస్తుండగా వీడియో తీశారు. కోళ్లను మురికి నీటితో ఎందుకు శుభ్రం చేస్తున్నారని వ్యాన్ డ్రైవర్‌ను వారు ప్రశ్నించగా దూర ప్రాంతం నుంచి కోళ్లను తీసుకొస్తున్నామని, కోళ్లను చల్లబర్చేందుకు వాటిపై నీళ్లు పోస్తున్నామని సమాధానం ఇచ్చాడు. కాగా వ్యాన్‌లోని కోళ్లను కౌటాల మండల కేంద్రంతో పాటు చింతలమానెపల్లి మండలంలోని పలు చికెన్ దుకాణాలకు సరఫరా చేసినట్లు తెలుస్తోంది. శుక్రవారం రవీంద్రనగర్ వారసంతలో వీటినే విక్రయించినట్లు సమాచారం. ఈ విషయంపై రవీంద్రనగర్ పంచాయతీ కార్యదర్శి విజయ్‌ను వివరణ కోరగా ఫోన్‌లో వ్యాపారిని హెచ్చరించామని, కోళ్ల వ్యాన్ వివరాలను పోలీసుశాఖకు అందించామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- లగ్గాం క్రాస్‌రోడ్డు నుంచి ఒడ్డుగూడ వరకు..
- తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- కానరాని సూచిక బోర్డులు



ప్రమాదకరంగా మూలమలుపు

దహెగాం: మండలంలోని లగ్గాం, పెంచికల్‌పేట్ క్రాస్‌రోడ్డు నుంచి ఒడ్డుగూడ వరకు ఉన్న రహదారిపై ప్రమాదకరంగా మూలమలుపులు ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

మూడు కిలోమీటర్లు.. ఐదు మలుపులు

లగ్గాం క్రాస్‌రోడ్డు నుంచి ఒడ్డుగూడ వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దారిలో ఐదు అత్యంత ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నాయి. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు జంకుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

హెచ్చరిక బోర్డులు లేవు..

ప్రమాదకరంగా మూలమలుపులు ఉన్నా, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జరిగిన సంఘటనలు..

- జనవరి, 2021లో మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన దండెర అంకన్న బోరింగ్ పైపుల కోసం పెంచికల్‌పేట్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఒడ్డుగూడ సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు.
- 4 మార్చి, 2022న కుంచవెల్లికి చెందిన బొలేరో వ్యాన్ అదుపు తప్పి మూలమలుపు వద్ద బోల్తా పడింది. దీంతో కూలీ పనులు చేసుకునే అత్తె శంకర్ మృతి చెందాడు.

నంబరు లేని వాహనాలు నడిపితే చర్యలు

గుడిహత్నూర్: వాహనదారులు నంబరు ప్లేట్లు లేని వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై ఇమ్రాన్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పలుచోట్ల వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పత్రాలు, నంబర్ ప్లేట్లను విధిగా ప్రదర్శించాలన్నారు. శనివారం పలు వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిరుపేద కుటుంబానికి అండగా ఉంటాం

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ గ్రామానికి చెందిన జాదవ్ గణేశ్ డ్రైవర్‌గా పని చేస్తూ గుండెపోటుతో వారం రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖంపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట విద్యారాణి, తదితరులు ఉన్నారు.